క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంటోన్మెంట్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మచ్చబొల్లారం సబ్‌స్టేషన్ పరిధిలోని రాధాసత్సంగ్ ఫీడర్ పరిధిలోని ప్రాంతం. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏఆర్‌కే ఫీడర్ పరిధిలో సరఫరా ఉండదన్నారు.

కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో..

సనత్‌నగర్: కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఐఏఎస్ క్వార్టర్స్, ఐపీఎస్ క్వార్టర్స్, మినిస్టర్ క్వార్టర్స్ ప్రాంతాలు.

ప్యారడైజ్ సబ్ డివిజన్ పరిధిలో...

మోండా మార్కెట్, సీతాఫల్‌మండి సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా ఉండదని ఏడీఈ ఆదినారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు గురుద్వారా ఏరియా, గోపాలపురం పోలీస్‌స్టేషన్, మనోహర్ టాకీస్, ప్రభుత్వ హైస్కూల్ ఏరియా, రైల్ కళారంగ్, నామాలగుండు, పద్మాగ్యాస్, అన్నానగర్, కింది బస్తీ, నెహ్రూ హైస్కూల్.
- మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాలిక్ బజార్, సౌత్ ఇండియా చర్చి, ప్రకాష్ హాస్పిటల్, ఓల్డ్ గాంధీ హాస్పిటల్, అఫ్జల్ అల్లాద్దీన్ క్రిస్టల్ ప్లాజా, మార్కండేయనగర్, ఫ్రైడే మార్కెట్, ఎస్‌ఆర్ హాస్పిటల్, రాఘవ గార్డెన్, ఉప్పర్ బస్తీ.
- మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మోండా మార్కెట్, అంజయ్య కాంప్లెక్స్, విక్టోరియా గంజ్, హిల్ స్ట్రీట్, జన్మభూమి, ఆదయ్యనగర్ ప్రభుత్వ పాఠశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు మెగా ముగ్గుల పోటీలు

కంటోన్మెంట్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శుక్రవారం మారేడుపల్లి షెనాయ్ ప్లే గ్రౌండ్‌లో శ్రీగణేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. బుధవారం ప్లే గ్రౌండ్ ఆవరణలో ముగ్గుల పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొనేలా సౌకర్యాలు కల్పించామన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

ఫిబ్రవరిలో డుసిమస్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ లా కాలేజీ విద్యార్థుల డుసిమస్–23ను ఫిబ్రవరి 10, 11న నిర్వహించనున్నట్లు డీన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఓయూలో డుసిమస్ ప్రచారం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సాంస్కృతిక పోటీలు ..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ కాలేజీల డిగ్రీ, పీజీ విద్యార్థులకు అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు ఫిబ్రవరి 21, 22, 23 తేదీలలో జరగనున్నాయి. జానపద, పాటలు, నృత్యాలు, సంగీతం, స్కిట్, మైమ్ తదితర అంశాల పై ఠాగూర్ ఆడిటోరియంలో పోటీలను నిర్వహించనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చే నెల 15 వరకు పేర్లను నమోదు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

వచ్చే నెలలో ఓయూ పీజీ రెగ్యులర్ కోర్సుల పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఫిబ్రవరిలో వివిధ పీజీ రెగ్యులర్ కోర్సుల 3 సెమిస్టర్, ఐదేళ్ల పీజీ కోర్సు 3, 5 సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ ప్రైవేటు, జిల్లా పీజీ కళాశాలల విద్యార్థులు ఈ నెల 30 వరకు, రూ.300 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 6 వరకు ఫీజు చెల్లించవచ్చు అన్నారు.

ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం తప్పిన వారికి వన్‌టైం ఛాన్స్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సులను చదివి తప్పిన బ్యాక్‌లాగ్ విద్యార్థులు పరీక్షలు రాసుకునేందుకు వన్‌టైం ఛాన్స్ కల్పించారు. యూనివర్సిటీ పరిధిలో 2000–01 నుంచి 2016–17 వరకు చదివి ఫెయిల్ అయిన వారు వచ్చే నెల 2 వరకు, రూ.200 అపరాధ రుసుముతో 10 వరకు ఫీజు చెల్లించవచ్చని అధికారులు సూచించారు.

బీజేపీలో చేరిక

సనత్‌నగర్: రాంగోపాల్‌పేట డివిజన్ డీవీకాలనీకి చెందిన పలువురు సీనియర్ సిటిజన్స్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశాన్ని బలోపేతం చేస్తున్న విధానాలు, దేశాభివృద్ధికి ఆకర్షితులైన పార్టీలో చేరుతున్నామన్నారు. సనత్‌నగర్‌లో బీజేపీ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో బజరంగ్‌లాల్ శర్మ, భద్రి విశాల్, మంత్రి రాజీవ్, హరీష్ దేశాయ్, నవీన్ షా ఉన్నారు.

ఫోర్ వేతో నో ట్రాఫికర్

- ఆలుగడ్డబావి వద్ద నాలుగో అండర్‌పాస్
- భారీ భవనాల తొగింపునకు కసరత్తు
- పూర్తిస్థాయి ట్రాఫిక్ సమస్యలకు చెక్



విస్తరణలో భాగంగా తొలగించనున్న ఎస్పీరోడ్డులోని భారీ భవన సముదాయాలు ఇవే

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రహదారులు, కూడళ్ల పూర్తిస్థాయి విస్తరణ కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు కసరత్తులు చేస్తున్నారు. మెట్రో కారిడార్ల నిర్మాణం సమయంలోనే రహదారుల విస్తరణ జరిగినప్పటికీ రైల్వేశాఖతో కొన్ని సాంకేతిక సమస్యలు, ప్రైవేటు భవన యజమానులకు సంబంధించిన న్యాయపరమైన కోర్టు సమస్యల కారణంగా కొన్ని ప్రాంతాల్లో విస్తరణ జరగలేదు. ఫలితంగా రహదారుల విస్తరణ జరిగినా ట్రాఫిక్ సమస్యలకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదు. రెండవ విడత విస్తరణ కార్యక్రమం చేపట్టి సికింద్రాబాద్ ప్రాంతంలోని ట్రాఫిక్ సమస్యలకు పూర్తిస్థాయి పరిష్కార మార్గం చూపేందుకు రెండేళ్ల క్రితమే ప్రతిపాదనలు రూపొందించినా కరోనా పరిస్థితుల కారణంగా పనులు పారంభం కాలేదు.

రూ.20 కోట్ల నిధులతో..

ఈ నెలాఖరులోగా విస్తరణ పనులు ప్రారంభించి ఆరు నెలలోగా పూర్తి చేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఇందులో భాగంగా పలు ప్రధాన రహదారుల్లోని భవనాలను తొలగింపునకు సిద్ధమవుతున్నారు. అండర్‌పాస్ ఏర్పాటు కోసం రూ.20 కోట్ల నిధులను జీహెచ్‌ఎంసీ అధికారులు కేటాయించారు. వైఎంసీఏ, సంగీత్, ఈశ్వరీబాయి, చిలకలగూడ జంక్షన్లను కలుపుతూ పూర్తిస్థాయి ఫోర్ వే రహదారిగా తీర్చిద్దినున్నారు. సికింద్రాబాద్ ఆలుగడ్డబావి రైల్వే వంతెన వద్ద నాలుగో అండర్‌పాస్ నిర్మాణం కోసం కార్యాచరణ సిద్ధమవ్వగా త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు. అటు రైళ్లు, ఇటు వాహనాల రాకపోకలను ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టనున్నారు.

ఇప్పటికే మూడు అండర్‌పాస్‌లు..

ఆలుగడ్డబావి రైల్వేట్రాక్ వద్ద ఇప్పటికే మూడు అండర్‌పాస్‌లు ఉన్నాయి. నగరంలో ఎక్కడా లేని విధంగా ఈ వంతెనకు 4వ అండర్‌పాస్ ఏర్పాటు చేయనున్నారు. రైల్వే అధికారులను పలుమార్లు సంప్రదించి ఒప్పించిన జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ అధికారులు అండర్‌పాస్ నిర్మాణం కోసం రూ.20 కోట్లు కేటాయించారు. రైల్ నిలయం–మెట్టుగూడ, మెట్టుగూడ–రైల్‌నిలయం, మెట్టుగూడ–చిలకలగూడ మార్గాల్లో వాహనాల రాకపోకలను మూడు అండర్‌పాస్‌లను వినియోగిస్తున్నారు. తాజాగా చిలకలగూడ చౌరస్తా–మెట్టుగూడ మార్గంలో వాహనాలు అనుమతించేందుకు 4వ అండర్‌పాస్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

త్వరలో భవనాల కూల్చివేతలు..

సెయింట్‌జాన్స్ కూడలి– వైఎంసీఏ జంక్షన్ వరకు ఫోర్‌వే కోసం విస్తరణ చేశారు. మధ్యలో అడ్డంకిగా మారిన భారీ భవనాలను కూల్చే యత్నంలో ఉన్నారు. అంతేకాక మరి కొన్ని రైల్వే భవనాల తొలగింపునకు కూడా రైల్వే అధికారుల అనుమతి పొందినట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ఆవరించి ఉన్న నాలుగు రహదారులను ఫోర్ వే గా తీర్చిదిద్దనున్నట్లు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్యలకు పూర్తిస్థాయి పరిష్కారం చూపేందుకు కార్యాచరణ అమలు చేయనున్నామన్నారు. ఏడాదిలోగా ఆలుగడ్డబావి అండర్‌పాస్‌తో పాటు, భవనాల కూల్చివేతలు పూర్తి చేసి వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు చేపడుతామన్నారు.

పోలీస్ స్టేషన్లకు నూతన భవనాలు



నూతన భవనాన్ని పరిశీలిస్తున్న దామోదర్ గుప్తా

కంటోన్మెంట్: జంట నగరాల్లో నాలుగు పోలీస్ స్టేషన్లకు నూతన భవనాలను త్వరలో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర గుప్తా తెలిపారు. బోయినపల్లి పోలీసు స్టేషన్ నూతన భవన నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో శాంతి భద్రతల నిర్వహణపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అందుకే దేశంలోనే తెలంగాణ పోలీసు శాఖకు విశిష్ట స్థానం వచ్చిందని తెలిపారు. జంట నగరాల్లో 19 పోలీస్ స్టేషన్లకు నూతన భవనాల నిర్మాణం చేపట్టామని ఇప్పటికే 10 స్టేషన్ భవనాలు ప్రారంభించామని, మిగతా భవనాల పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. వారం రోజుల్లో బోయినపల్లి పోలీసు స్టేషన్ ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. బేగంబజార్, షాహినాయత్ గంజ్, సైదాబాద్ పోలీస్ స్టేషన్ భవనాలను రెండు నెలల్లో ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్తర మండల అదనపు డీసీపీ యోగేష్ గౌతమ్, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు యుగేందర్, రాజు, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న లక్ష్మణ్

అడ్డగుట్ట: పిల్లలకు పండుగల ప్రాముఖ్యతతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందని మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి పేర్కొన్నారు. అడ్డగుట్ట డివిజన్ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బుధవారం శాంతినగర్ అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఆమె చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ పద్మజ, శారదా మల్లేష్, అనిత, నాగేశ్వర్ రెడ్డి, వీరన్న పాల్గొన్నారు.

బీదలబస్తీ మైదానంలో..

సికింద్రాబాద్: సంక్రాంతి పండగ తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబాలని బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే.లక్ష్మణ్ పేర్కొన్నారు. బీదలబస్తీ మైదానంలో బుధవారం మహిళామోర్చా నాయకురాలు మేకల కీర్తిహర్ష కిరణ్ నేతృత్వంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి లక్ష్మణ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, హరి, వేణుయాదవ్, రాజేశ్వర్‌రావు, భాస్కర్‌గిరి, నాగశిరోమణి, శోభారాణి, అనూష పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

పద్మారావునగర్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బన్సీలాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ కె.హేమలత, ఇన్‌చార్జ్ జి.పవన్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. హమాల్‌బస్తీలో ఏర్పాటు చేయనున్న కంటి వెలుగు శిబిరంలో ఏర్పాట్లు బుధవారం పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 18న హమాల్‌బస్తీలో కంటి వెలుగు శిబిరాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభిస్తారన్నారు. శిబిరానికి వచ్చే వారి కోసం అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. బస్తీ దవాఖానా ప్రాంగణంలో మంచినీళ్లు, కుర్చీలు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ పరిధిలో 7 కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డీఈ శ్రీనివాస్, ఎస్‌పీహెచ్‌ఓ రాజశ్రీ, సక్కుబాయి, నాయకులు ఎల్. వెంకటేశన్, ఏసూరి మహేష్, లక్ష్మిపతి, కుషాల్, అబ్బాస్ పాల్గొన్నారు.

యాప్ డౌన్‌లోడ్ పేరుతో రూ.84,999 లూటీ

సనత్‌నగర్: ఆన్‌లైన్ బిల్లులు త్వరితగతిన జరిగేందుకు ఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఓ మహిళను నమ్మించిన అగంతకుడు రూ.84,999 కొల్లగొట్టిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బేగంపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన స్వాతిసింగ్ (39) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.ఓ అగంతకుడు ఫోన్‌చేసి ఆన్‌లైన్, చెల్లింపులు, సాధారణ బిల్లుల చెల్లింపులు అప్‌డేట్ చేయాలంటే ఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా సూచించాడు. ముందుగా రూ.10లు చెల్లింపు జరిపేందుకు ఆమె ఫోన్‌కు ఓ లింక్ పంపించి నెట్ బ్యాంకింగ్ ద్వారానే చెల్లింపు జరపాలని చెప్పాడు. చెల్లింపు జరిపిన తరువాత యూటీఆర్ సంఖ్య అప్‌డేట్ కోసం యాప్‌ను రిఫ్రెష్ చేయమని చెప్పాడు. అగంతకుడు చెప్పినట్లు చేసిన స్వాతిసింగ్ ఖాతా నుంచి రెండు విడతలుగా 84,999 డబ్బులు కట్ కావడంతో పోలీసులను ఆశ్రయించింది.

దళారీ వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



చెక్కులు అందజేస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో దళారుల వ్యవస్థను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. మెట్టుగూడ, బౌద్ధనగర్ డివిజన్ల పరిధిలో పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం ఆయన అందజేసి మాట్లాడారు. సంక్షేమ పథకాలను అందించేందుకు సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం బౌద్ధనగర్ డివిజన్‌లో రూ.1.50 కోట్లతో సీవరేజ్, సీసీ రోడ్ల నిర్మాణం పనులను ప్రారంభించారు. అంబర్‌నగర్, బౌద్ధనగర్ ప్రాంతాల్లో ప్రారంభించిన పనులను సత్వరమే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం రమణారెడ్డి, జీహెచ్‌ఎంసీ ఈఈ ఆశాలత, కార్పొరేటర్లు కంది శైలజ, రాసూరి సునీత, నాయకులు తీగుళ్ల కిరణ్‌గౌడ్, కంది నారాయణ, సుంకు రాంచందర్ పాల్గొన్నారు.

నందకిశోర్‌కు ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగం విద్యార్థి నందకిశోర్‌కు డాక్టరేట్ డిగ్రీ లభించింది. విశ్రాంత అధ్యాపకులు జాడి ముసలయ్య పర్యవేక్షణలో మహబూబ్‌నగర్ జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు విధానం పై పరిశోధనకు డాక్టరేట్ పొందారు.

కేలండర్ ఆవిష్కరణ

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను నీతూ ప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రఘు, సత్యనారాయణ, కృపానంద్, నరేందర్ ప్రసాద్, మధుసూదన్‌గౌడ్, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

100కు డయల్ చేసి ఉంటే బతికేవాడేమో!

మర్డర్ కేసు నిందితుల వివరాలు వెల్లడించిన డీసీపీ చందనా దీప్తీ




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ చందనా దీప్తి

కంటోన్మెంట్: ఆపత్కాలంలో 100కు డయల్ చేస్తే తక్షణ సాయం అందే అవకాశముంటుందని నార్త్‌జోన్ డీసీపీ చందనా దీప్తీ అన్నారు. ఆదివారం అర్ధరాత్రి మహంకాళీ పోలీసు స్టేషన్ పరిధిలోని మర్డర్ కేసులో మృతుడు పోలీసులకు కాల్‌చేసి ఉంటే బతికేవాడన్నారు. ఈ కేసును ఛేదించిన నార్త్‌జోన్ పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. భూక్యా శివాజీ (22) అనే వ్యక్తి నేరేడ్‌మెట్‌కు చెందిన ఇంటర్మీడియేట్ చదివే మిత్రుడు (మైనర్)తో కలిసి గ్యాస్‌మండీలోని తన ఇంటి సమీపంలో మద్యం తాగేందుకు వెళ్లాడు. నార్త్‌లాలాగూడకు చెందిన గౌస్ పాషా (22) అనే ఫ్లవర్ డెకరేటర్ కూడా మద్యం తాగుతూ ఫోన్‌లో గట్టిగా మాట్లాడుతున్నాడు. ఫోన్‌లో గట్టిగా మాట్లాడొద్దనే క్రమంలో ముగ్గురు గొడవపడ్డారు. ఈ క్రమంలో గౌస్‌పాషా తన మిత్రుడు మహ్మద్ నయీం(22)కు ఫోన్ చేయగా నయీమ్ తనతో పాటు మరో మిత్రుడు మహ్మద్ జాకీర్‌తో కలిసి కారులో వచ్చాడు. వీరి జోక్యంతో గొడవ సద్దుమణుగుతున్న క్రమంలోనే గౌస్‌పాషా ఫ్లవర్ డెకరేషన్‌లో వాడే కత్తితో శివాజీ మెడపై పొడవడంతో తీవ్ర రక్తస్రావం అయింది. ఇది చూసిన శివాజీ స్నేహితుడు (మైనర్) అక్కడి నుంచి పారిపోయాడు. అనంతరం నిందితులు కూడా తమ కారులో పరారయ్యారు.

- గొడవకు ముందే మద్యం మత్తులో మిత్రులకు ఫోన్ చేసి వేధించడంతో దాడి అనంతరం తీవ్ర గాయాలతో ఉన్న శివాజీ తన మిత్రులకు పదే పదే ఫోన్ చేసినా ఎవరూ స్పందించలేదు. గొడవకు ముందు తనతో పాటే ఉన్న మైనర్ సైతం పారిపోయి, మళ్లీ వచ్చి తన ద్విచక్ర వాహనం తీసుకుని వెళ్లిపోయాడు. ఆ సమయంలో శివాజీ 100కు లేదా 108కు ఫోన్ చేసి ఉంటే ప్రాణాలు దక్కేవని డీసీపీ అభిప్రాయ పడ్డారు. ఈ సమావేశంలో ఏసీపీ రమేష్, మహంకాళీ పోలీసలు పాల్గొన్నారు.

దేశం గర్వించేలా రాణిస్తా: నిఖత్



నిఖత్ జరీన్, ప్రణవి చంద్రలను సన్మానించి రాజీవ్‌రెడ్డి

సనత్‌నగర్: పోటీ ఏదైనా దేశం గర్వించేలా రాణిస్తానని అర్జున అవార్డు గ్రహీత, ఐబీఏ మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ విజేత నిఖత్ జరీన్ అన్నారు. నిఖత్ జరీన్‌తో పాటు హైదరాబాద్ సీనియర్ క్రికెట్ మహిళా జట్టు వైస్ కెప్టెన్ ప్రణవి చంద్రలను బుధవారం కంట్రీ క్లబ్ చైర్మన్ వై.రాజీవ్ రెడ్డి ఘనంగా సత్కరించి క్లబ్ గౌరవ సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిఖత్ జరీన్ మాట్లాడుతూ.. ఢిల్లీ వేదికగా మార్చిలో జరగనున్న వరల్డ్ చాంపియన్‌షిప్ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నానని, బంగారు పతకం సాధించడమే లక్ష్యమన్నారు. సన్మానాలు, సత్కారాలు బాధ్యతలు మరింత పెంచడమే కాదని, బాధ్యతను గుర్తు చేస్తాయన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో క్రీడలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని రాజీవ్‌రెడ్డి పేర్కొన్నారు. కంట్రీ క్లబ్‌తో ఎప్పటి నుంచో తనకు అనుబంధం ఉందని క్రీడారంగ ప్రముఖుడు చాముండేశ్వరీనాథ్ గుర్తు చేసుకున్నారు.

సీసీఎంబీలో ‘యంగ్ ఇన్నోవేటర్స్’ప్రోగ్రాం

లాలాపేట: తార్నాకలోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ)లో యంగ్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రాం(వైఐపీ) కొనసాగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 8,9,10వ తరగతికి చెందిన సుమారు 26 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 3 నుంచి శిక్షణ కార్యక్రమం కొనసాగుతుంది. శాస్త్రవేత్తలతో విద్యార్థుల ముఖాముఖీ, ల్యాబ్‌ల సందర్శన, విద్యార్థులకు సైన్స్ పరిశోధన రంగంలో కలిగిన సందేహాల నివృత్తి తదితర కార్యక్రమాలలో విద్యార్థులు శాస్త్రవేత్తలతో బిజిబిజీగా గుడుపుతున్నారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి సుమారు 260కి పైగా విద్యార్థులు రాగా ఇందులో 26 మందిని ఎంపిక చేశామన్నారు. 12 రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణ ఈ నెల 13న ముగుస్తుందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు తద్వారా సైన్స్ పరిశోధనా రంగం పట్ల విద్యార్థులకు ఆసక్తి పెంచడం ఈ శిక్షణ ఉద్దేశం అన్నారు.

కంటి వెలుగుకు ఏర్పాట్లు పూర్తి

లాలాపేట: ఈ నెల 18 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండవ విడత కంటి వెలుగు నిర్వహణకు లాలాపేట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైద్యాధికారి సౌశీల్యారాణి, ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరిత పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తార్నాక డివిజన్ పరిధిలోని లాలాపేట ప్రొ. జయశంకర్ స్టేడియం, తార్నాకలోని నాగార్జునగర్ కమ్యూనిటీ హాల్లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

కట్నం కోసం వేధింపులు.. భర్త, అత్త మామపై ఫిర్యాదు

సనత్‌నగర్: కట్నం కోసం భర్త, అత్తమామల వేధింపులు తాళలేక ఓ గృహిణి బేగంపేట మహిళా పోలీసులను ఆశ్రయించింది. తుకారంగేట్‌కు చెందిన శ్రావణి (24), మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొకూర్ ప్రాంతంలోని భరత్‌నగర్‌కు చెందిన పాయావుల సాయికుమార్ (26) ప్రేమించుకుని 2019లో ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. పెళ్లయిన కొన్ని రోజుల తర్వాత సాయికుమార్ భార్యను తన తల్లిదండ్రుల వద్దకు తీసుకువెళ్లాడు. ఏడాదిన్నర పాటు వీరి కాపురం సజావుగానే సాగి ఇద్దరు పిల్లలు అయ్యారు. ఆ తర్వాత భర్తతో పాటు అత్త మామలు కట్నం తీసుకురాలేదని వేధింపులకు గురి చేయడం ప్రారంభించారు. వేధింపులు తట్టుకోలేని శ్రావణి నెలకు రూ.15 వేల చొప్పున 10 నెలల పాటు భర్తకు ఇస్తూ వచ్చింది. అయినప్పటికీ సాయికుమార్‌లో ఎలాంటి మార్పు రాలేదు. రోజురోజుకూ వేధింపులు ఎక్కువవడంతో బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కొన్ని రోజులు మౌనంగా ఉన్న వాళ్లు మళ్లీ కట్నం కోసం వేధిస్తుండటంతో బుధవారం భర్త, అత్త మామలపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కంటోన్మెంట్: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మహంకాళి పోలీసులు అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను నార్త్‌జోన్ డీసీపీ చందనా దీప్తి వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ బిర్‌బూమ్ జిల్లాకు చెందిన నూర్నాబి సేఖ్ (24) నగరంలోని మోండా మార్కెట్‌లో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఇతడు గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకుని 185 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ధూల్‌పేటకు చెందిన వ్యక్తి సూరి వద్ద గంజాయి కొనుగోలు చేసి, అవసరమున్న వారికి విక్రయిస్తున్నట్లు తెలిపాడు. సూరి పరారీలో ఉన్నాడన్నారు.

తల్లి సంరక్షణ విషయంలో గొడవ

అన్నదమ్ములకు రెండ్రోజుల జైలు



రాములు



సాయిలు

కంటోన్మెంట్: తల్లి సంరక్షణ విషయంలో గొడవపడి దాడి చేసుకున్న సోదరులిద్దరికీ రెండ్రోజుల జైలు శిక్ష పడింది. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వివరాల ప్రకారం..సాయిలు, రాములు ఇద్దరు సోదరులు. ఈ నెల 5వ తేదీన రాములు, సాయిలు ఇంటికెళ్లి తల్లి విషయంలో మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో మాటమాట పెరిగి ఇద్దరూ పరస్పరం దాడులు చేసుకుని ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు సోదరులను కోర్టులో హాజరుపర్చగా, 14వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రెండ్రోజుల జైలు శిక్ష విధించారు.

పూజ చేస్తుండగా చీరకు నిప్పు.. పరిస్థితి విషమం

సనత్‌నగర్: పూజ చేస్తుండగా ప్రమాదవశాత్తూ ఓ మహిళ చీరకు నిప్పంటుకోవడంతో తీవ్ర గాయాలైన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేట గురుమూర్తిలేన్‌కు చెందిన బాల విజయలక్ష్మి (72) ఇంట్లో పూజ చేస్తుండగా ప్రమాదవశాత్తూ చీరకు నిప్పంటుకుంది. క్షణాల్లో మంటలు ఒళ్లంతా వ్యాపించడంతో దాదాపు 90 శాతం కాలిపోయింది. సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

హామీలు నెరవేరుస్తున్నాం

రసూల్‌పురా: బీజేపీ మీట్ యువర్ మెంబర్ కార్యక్రమంలో భాగంగా కాలనీ వాసులకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తున్నట్లు కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ అన్నారు. బుధవారం బోర్డు ఏడవ వార్డు పరిధిలోని టీచర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రహరీ, నెహ్రూ సెంటినరి కాలనీ శ్మశనవాటిక ప్రహరీ నిర్మాణ పనులు, అదే విధంగా గన్‌రాక్‌లోని కంటోన్మెంట్ స్టాఫ్ క్వార్టర్స్ మరమ్మతుల పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. గతంలో పర్యటించిన సందర్భంలో స్థానికులు సమస్యలు తన దృష్టికి తీసుకవచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కేబీ. శంకర్రావు, ప్రశాంత్ ప్రభు పాల్గొన్నారు.

శుద్ధమైన తాగునీరు అందిస్తాం



పనులు ప్రారంభిస్తున్న సామల హేమ

సికింద్రాబాద్: డివిజన్ వాసులకు శుద్ధమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కార్పొరేటర్ సామల హేమ పేర్కొన్నారు. బుధవారం ఆమె సీతాఫల్‌మండిలోని తాగునీటి ట్యాంక్ మరమ్మతు పనులను ప్రారంభించి మాట్లాడారు. త్వరితగతిన ట్యాంకు మరమ్మతు పనులను పూర్తి చేసి మరింత శుద్ధమైన తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి సెక్షన్ ఆఫీసర్ అన్విత్, నాయకులు శైలేందర్, సరోజిని, అనిత, పద్మ, అర్చన, ప్రవల్లిక, సంధ్య పాల్గొన్నారు.

పోటాపోటీగా ముగ్గుల పోటీలు

రసూల్‌పురా: సంక్రాంతి సంబురాల్లో భాగంగా కంటోన్మెంట్ బోర్డు మూడవ వార్డు ఈద్గా అంబేద్కర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నేతలు రఘు, సూరజ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా బాలికలు, యువతులు మహిళలు పోటీ పడి రంగులతో అందమైన ముగ్గులను తీర్చిదిద్దారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మన్నే క్రిషాంక్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోని, త్రివేద్, పరమేష్, శ్రీను, పరశురాం పాల్గొన్నారు.